నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్, సోమవారం 16 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL


## గణేశ్ మండపం వద్ద పూజలు



పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, రెవెన్యూ ఉద్యోగులు

ఎదులాపురం, సెప్టెంబర్ 15 : ఆదిలాబాద్ పట్టణంలోని రెవెన్యూ గెస్ట్‌హౌస్ ఆవరణలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద ఆదివారం కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని పరామర్శించిన రామన్న



మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామన్న

ఎదులాపురం, సెప్టెంబర్ 15 : మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేత ఇటీవలే మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఆమె తుది శ్వాస విడిచారు. మాజీ మంత్రి జోగు రామన్న తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం జడ్చర్లలోని అవాంఛ గ్రామానికి చేరుకుని మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆమె చిత్రపటం వద్ద పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ మంత్రి వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, ఎంపీపీ కుమ్ర రాజు ఉన్నారు.

## 2,199 మంది రైతులు 3,095 ఎకరాలు నష్టం

● చివరిదశలో ముంచిన వర్షాలు ● సర్కారు సాయం పెట్టుబడులకు సరిపోదు



జైనథ్ మండలంలోని పెన్‌గంగా ప్రవాహంతో నీట మునిగిన పంటలు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలు అన్నదాతలకు అపార నష్టాన్ని చేకూర్చాయి. భారీ వర్షాల ఫలితంగా జిల్లాలో వాగులు పొంగిపొర్లగా, చెరువులు మత్తళ్లు దూకాయి. పెన్‌గంగా ఉధృతి కారణంగా పరీవాహక ప్రాంతాల రైతుల పంటలు నీటమునిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏకదాటి వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని చేలలో నీరు నిలువడంతో నష్టం వాటిల్లింది. జిల్లాలో ఈ ఏడాది వానకాలంలో రైతులు 5.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. పత్తి 3.80 లక్షల ఎకరాల్లో పండిస్తున్నారు. పత్తితోపాటు సోయా, కంది పంటలను సాగు చేస్తున్నారు. జూన్ మొదటి, రెండో వారంలో వేసిన విత్తనాలు మొలకెత్తగా వాతావరణంతోపాటు వర్షాలు అనుకూలించడంతో దిగుబడిపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. అవసరమైన సమయంలో ఎరువులు, పురుగుల మందులు చల్లుతూ కాపాడుకుంటూ వచ్చారు.

### చేతికొచ్చే దశలో అపార నష్టం

పత్తి, సోయా, కంది పంటలు 65 నుంచి 75 రోజుల దశలో ఉన్నాయి. సోయా కోత దశలో పత్తి పూత, కాయ దశలో ఉండగా కంది బాగా పెరిగింది. దీంతో రైతులు ఈ ఏడాది పంటలు ఎలాంటి ఢోకా ఉండదని అనుకున్నారు. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు కురిసిన వర్షాల కారణంగా రైతులు అన్నదాతలను నట్టేట ముంచాయి. వరద ప్రవాహం ఫలితంగా వేల ఎకరాల్లో పత్తి, సోయా, కంది పంటలు నీట మునిగాయి. ప్రభుత్వం సూచనల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు నష్టాన్ని అంచనా వేయడానికి క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను సేకరించారు. వర్షాల కారణంగా జిల్లాలో 3,095 ఎకరాలకు పంటలకు నష్టం వాటిల్లిందని, 2,199 మంది రైతులు పంటలను కోల్పోవాల్సి వచ్చిందని తేల్చారు. జిల్లాలో పంటనష్టం వివరాలను ప్రభుత్వానికి పంపించారు.

### ప్రభుత్వ సాయం పెట్టుబడులకు సరిపోదు..

రైతులు పత్తి ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చువుతుంది. ఎకరానికి సరాసరిగా 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది కేంద్రం పత్తికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 ప్రకటించింది. ప్రైవేటు వ్యాపారులు ఎక్కువ ధరతో కొనుగోలు చేసే అవకాశాలున్నాయి. ఎకరం భూమిలో రైతులు పత్తి సాగు చేస్తే రూ.75 వేల నుంచి రూ.80 వేల వరకు ఆదాయం రావచ్చు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ డబ్బులతో కనీసం పెట్టుబడులకు సరిపోవు. ప్రభుత్వం కనీసం ఎకరాకు రూ. 30 వేల సాయం అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

### రూ. 10 వేలతో ప్రయోజనం లేదు..



*వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు రూ.10 వేలు ఇస్తామని ప్రభుత్వం సాయం ఏ మాత్రం సరిపోదు. పత్తి పంట ఎకరానికి రూ.75 వేల వరకు ఆదాయం వస్తుంది. సోయాబిన్ రూ.50 వేల వరకు వస్తుంది. పంటలు చివరిదశలో వర్షాలు నష్టాన్ని చేకూర్చాయి. సాయం ప్రకటించినా ఇప్పటి వరకు ఎలాంటి జీవో విడుదల చేయలేదు. దీంతో ప్రభుత్వం రైతులకు అందించే సాయంపై అనుమానం వ్యక్తమవుతున్నది. మంత్రులు రూ.1500 కోట్లు ఫసల్ బీమా ప్రిమియం కడుతామని చెప్పారు. ప్రభుత్వం ఇన్సూరెన్స్ డబ్బులు కట్టకపోవడంలో బీమా డబ్బులు అందవు.*

**- సంగెం బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక, జిల్లా అధ్యక్షుడు**



▲ పంజేషా చౌక్ వద్ద వినాయకుడి శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న భక్తులు

## ప్రశాంతంగా నిమజ్జనం

● భైంసాలో వైభవంగా గణేశ్ శోభాయాత్ర ● పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, ఎస్పీ, హిందూ ఉత్సవ సమితి సభ్యులు

భైంసా, సెప్టెంబర్ 15 : 'గణపతి బప్పా మోరియా.. ఆదా లడ్డూ కాలియా..' అంటూ జనం నీరాజనం పలికారు. భైంసా పట్టణంలో తొమ్మిది రోజులపాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడి నిమజ్జనోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా కొనసాగింది. డప్పు చప్పుళ్లు, కోలాటాలు, యువకుల నృత్యాల మధ్య శోభాయాత్ర సాగింది. కేరింతలు కొడుతూ, రంగులు చల్లుకుంటూ యువకులు, చిన్నారులు చిందులు వేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. గడ్డెన్న, సుద్దవాగు ప్రాజెక్టు వద్ద గణనాథులకు నిమజ్జనం చేసి వినాయక సెలవిక అంటూ వీడ్కోలు పలికారు. నిమజ్జనోత్సవ నేపథ్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఎస్పీ జానకి షర్మిల భైంసాలో మకాం వేసి బందోబస్తును పర్యవేక్షించారు. గణేశ్ మండలి సభ్యులు, యువజన సంఘాల నాయకులు, హిందూ వాహిని, కుల సంఘాలు, ఉత్సవ కమిటీ సభ్యులు మంగళహారతులు ఇచ్చి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు. భైంసా పట్టణంలోని గణేశ్‌నగర్‌లో గల మున్నూరుకాపు సంఘ భవనంలో ఎస్పీ జానకి షర్మిల, ఎమ్మెల్యే రామారావు పటేల్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్, బబ్రు మహారాజ్, డాక్టర్ నగేశ్, రామకృష్ణ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, బీజేపీ నాయకులు గాలి రవి, కపిల్, రావుల పోశెట్టి, భట్టిగల్లి మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తూమోల్ల దత్తుతోపాటు సభ్యులు, పలువురు ప్రముఖుల ఆధ్వర్యంలో మంగళ హారతులు ఇచ్చి నిమజ్జన శోభయాత్రను ప్రారంభించారు. భారీ గణేశ్ విగ్రహాలను క్రేన్, ట్రాక్టర్‌లలో ఎక్కించి నిమజ్జనానికి తరలించారు. శోభాయాత్ర కొనసాగే మార్గాల్లో మహిళలు వినాయకుడికి హారతులు ఇస్తూ, అక్షింతలు చల్లుతూ, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

### కోలాహలం.. ఆకట్టుకున్న శోభాయాత్ర

అన్ని వీధులు కోలాహలంగా కనిపించాయి. బాల గణేశ్ మండళ్లు, పలు యువజన సంఘాలు ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమలను ఉదయం 10 గంటల నుంచి నిమజ్జనం చేశారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్దకు చేరుకున్న వాహనాలను వరుస క్రమంలో అనుమతించి ప్రతిమలను నిమజ్జనం చేశారు. నిమజ్జన శోభాయాత్ర పలువురిని ఆకట్టుకుంది. బ్యాండు మేళాలు, తాషా వంటి వాటితో యువకులు, మండళ్ల సభ్యులు నృత్యాలు చేశారు. కేరింతలు కొడుతూ హుషారుగా కనిపించారు. శోభాయాత్రలో పాల్గొన్న యువకులకు గణేశ్ మండలి సభ్యులు, యువజన సంఘాలు, లక్ష్మీనర్సింహాస్వామి యోగా గ్రూప్ సభ్యులు, హనుమాన్ చాలీసా సభ్యులు పులిహోర, ఉప్మాను పంచి పెట్టారు. కాగా.. పోలీస్‌స్టేషన్ సమీపంలో పోలీసులు, పురాణాబజార్‌లో హిందూ వాహిని ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి మండలీ సభ్యులను సన్మానించారు. మండలి సభ్యులకు జ్ఞాపికలు అందించారు. ఉత్సవ కమిటీ, మండళ్ల సభ్యులు రెవెన్యూ అధికారులు, పోలీసులు శోభాయాత్రను ముందుకు నడిపించారు.

### భారీ బందోబస్తు

ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో ఒక ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 28 మంది సీఐలు, 32 మంది ఎస్సైలతోపాటు సుమారు 650 మంది వరకు పోలీసు సిబ్బందితో నిమజ్జనోత్సవానికి భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. ఎస్పీ జానకి షర్మిల నేతృత్వంలో భైంసాలో బందోబస్తును పర్యవేక్షించారు. ఏఎస్పీ అవినాశ్ కుమార్, సీఐ రాజారెడ్డి సమాచారాన్ని తెలుసుకున్నారు. సీసీ కెమెరాల ద్వారా పోలీస్‌స్టేషన్‌లో కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. మఫ్టీలో ఉన్న పోలీసులు సమాచారాన్ని కంట్రోల్ రూంకు చేరవేశారు.



గల్లీలో తిరుగుతున్న బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ జానకి షర్మిల, చిత్రంలో ఎమ్మెల్యే రామారావు పటేల్



నిమజ్జనంలో పాల్గొన్న ఎస్పీ జానకి షర్మిల, ఎమ్మెల్యే రామారావు పటేల్

## వెయ్యి మందితో బందోబస్తు

● గణపతి నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి.. ● మల్టీ జోన్ వన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

● అధికారులకు దిశానిర్దేశం ● 200 సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ ద్వారా పర్యవేక్షణ



ఎస్పీతో కలిసి బందోబస్తుపై సమీక్షిస్తున్న మల్టీ జోన్ వన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

ఎదులాపురం, సెప్టెంబర్ 15 : గణపతి నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి 1000 మంది పోలీసు సిబ్బందితో జిల్లావ్యాప్తంగా బందోబస్తు ఏర్పాటు చేశామని మల్టీ జోన్ వన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పోలీసు అతిథి గృహంలో గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పట్టణంలో పర్యటించి నిమజ్జన రూట్‌ను పరిశీలించారు. అనంతరం ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి డీఎస్పీలు, సీఐలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ.. ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. జిల్లా పోలీసు యంత్రాంగం 24 గంటలు అప్రమత్తమై అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పట్టణాన్ని 11సెక్టార్లుగా విభజించి ఎస్సై స్థాయి అధికారులను కేటాయించామని తెలిపారు. ఏడు క్లస్టర్లకు గాను ఒక్కో క్లస్టర్‌లో సీఐ స్థాయి అధికారులతో పెట్రోలింగ్ గస్తీ నిర్వహిస్తూ పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, వీడియోగ్రఫీ ద్వారా ప్రత్యక్షంగా 24 గంటలు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్‌రెడ్డి, డి సురేందర్ రెడ్డి, ప్రసాద్, ఒకటో పట్టణ సీఐ సునీల్‌కుమార్, కరుణాకర్, శ్రీనివాస్, ప్రణయ్‌కుమార్ పాల్గొన్నారు.



జారుడుగుంజను చూసేందుకు వచ్చిన గ్రామస్తులు

## ఘనంగా హనుమాన్ పండుగ

సోన్, సెప్టెంబర్ 15 : సోన్ మండలంలోని పాక్‌పట్ల, మాదాపూర్ గ్రామాల్లో ఆదివారం హనుమాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని యేటా ఈ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. చివరి రోజు గణేశ్ నిమజ్జనం రోజు హనుమాన్ పండుగను గ్రామస్తులు నిర్వహిన్నారు. గ్రామంలోని జారుడుగుంజను ఎక్కేందుకు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



విజేతలుగా నిలిచిన బాలుర జట్టు

## ముగిసిన బేస్‌బాల్ పోటీలు

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 15 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్-21 జూనియర్ బాల, బాలికల బేస్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుండ్రు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి గంగాధర్ నేతృత్వంలో నిర్వహించారు. ఇందులో 22 జిల్లాల నుంచి 22 జట్లు, 980 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం మొదట జరిగిన బాలుర సెమీ ఫైనల్‌లో హైదరాబాద్, నిజామాబాద్ జట్లు తలపడగా హైదరాబాద్ జట్టు 05-02తో విజయం సాధించింది. రెండో సెమీ ఫైనల్‌లో రంగారెడ్డి, వరంగల్ జట్లు తలపడగా రంగారెడ్డి 04-02తో విజయం సాధించింది. ఫైనల్‌లో రంగారెడ్డి, హైదరాబాద్ జట్లు తలపడగా హైదరాబాద్ 05-01తో కప్పు గెలుచుకుంది. బాలికల మొదటి సెమీ ఫైనల్‌లో రంగారెడ్డి నల్గొండ తలపడగా 06-04తో నల్గొండ జట్టు విజయం సాధించింది. రెండో సెమీ ఫైనల్‌లో నిజామాబాద్‌తో మహబూబాబాద్ తలపడగా 10-0తో నిజామాబాద్ జట్టు విజయం సాధించింది. ఫైనల్‌లో నిజామాబాద్, నల్గొండ జట్లు తలపడగా నిజామాబాద్ జట్టు కప్పు కైవసం చేసుకుంది.



బాలికల జట్టు




పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

## కొత్త బస్సులను ఏర్పాటు చేయాలి

ఖానాపూర్ టౌన్, సెప్టెంబర్ 15 : ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను ఏర్పాటు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు నంది సమత అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అదివారం ఖానాపూర్ బస్టాండ్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకం పేరిట ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడం వల్ల ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగిందన్నారు. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు లేకపోవడం వల్ల వృద్ధులు, చిన్న పిల్లల తల్లులు, పురుషులు, వికలాంగులు సీట్లు దొరకక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని సందర్భాల్లో బస్సుల్లో సీట్లు దొరకక కొట్టుకున్నారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులపై కూడా దాడులు జరుగుతున్నాయన్నారు. వీటన్నింటికీ సరిపడా బస్సులు లేకపోవడమే కారణమన్నారు. పరిమితికి మించి బస్సుల్లో ప్రయాణించడం వల్ల టైర్లు పగిలి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కొత్త బస్సులు ఏర్పాటు చేయడమే కాకుండా కొత్త ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బస్టాండ్‌లో ప్రయాణికులతో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి లక్ష్మి, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, లక్ష్మి, విజయ, సునీత, రమ పాల్గొన్నారు.

## కొట్టుకుపోయిన కల్వర్టు

● ఇటీవల కురిసిన వర్షాల ఫలితం

● పట్టించుకోని ప్రభుత్వం ● అవస్థలు పడుతున్న ప్రజలు

లక్ష్మణచాంద, సెప్టెంబర్ 15 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లక్ష్మణచాంద-సోన్ ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు కొట్టుకుపోయింది. లక్ష్మణచాంద నుంచి సోన్ వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. ఈ కల్వర్టు పైనుంచి వందలాది వాహనాలు వెళ్తాయి. కల్వర్టు కొట్టుకుపోవడంతో ప్రయాణికులు సోన్ మండలంలోని బొప్పారం మీదుగా వెళ్తున్నారు. కల్వర్టు కొట్టుకుపోయి పక్షం రోజులు దాటుతున్నా, అధికారులు కనీసం తాత్కాలిక వంతెన నిర్మాణం చేపట్ట లేదు. గతేడాది వర్షాకాలంలో కొట్టుకుపోవడంతో రెండు రోజుల్లో తాత్కాలిక కల్వర్టు ఏర్పాటు చేశారు. కానీ.. ఈ సంవత్సరం కనీసం అది కూడా నిర్మాణం చేపట్టలేదు. అధికారులు పట్టించుకోకపోవడంపై మండల ప్రజలు మండిపడుతున్నారు.



భారీ వర్షాలకు పీచర-సోన్ రహదారిపై తెగిన కల్వర్టు



మాట్లాడుతున్న ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ వికాస్ శర్మ

## క్రమశిక్షణకు మారు పేరు ఎన్‌సీసీ

ఎదులాపురం, సెప్టెంబర్ 15 : క్రమశిక్షణ, దేశభక్తి ఎన్‌సీసీతోనే సాధ్యమవుతుందని ఉమ్మడి ఎన్‌సీసీ జిల్లా కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ వికాస్‌శర్మ అన్నారు. తెలంగాణ 32 బెటాలియన్ సీఏటీసీఐ ఏడో శిక్షణ శిబిరం జిల్లా కేంద్రంలోని వైటీసీలో అట్టహాసంగా ప్రారంభమైంది. పది రోజులపాటు కొనసా గే శిక్షణకు కల్నాల్ వికాస్ శర్మ పాల్గొని కేడెట్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కల్నాల్ వికాస్ మాట్లాడుతూ.. దేశరక్షణ కోసం ఎన్‌సీసీ స్థాపించబడిందన్నారు. బ్రిటిష్ కాలం నుంచే యూనివర్సిటీ కేడెట్ పేరున కొనసాగేదని, 1947లో ఎన్‌సీసీగా పేరును మార్చడం జరిగిందన్నారు. యుద్ధ పరిస్థితులు వచ్చినప్పుడు ఎన్‌సీసీ కేడెట్లకు తొలి ప్రాధాన్యత ఇచ్చి సైన్యంలో చేర్చుకుంటారన్నారు. శిక్షణలో కేడెట్లు మంచి ప్రతిభ కనబర్చాలన్నారు. ఏఎన్ఏలు జగ్గరాం, గాలి అశోక్, స్వామి, పూర్ణచందర్, రజిత, రాజేశ్వరి, శ్రీ నివాస్, సాయినాథ్, వినోద్, కేర్జేకర్లు ఉమేశ్ కుమార్ పాల్, నరేందర్ పాల్గొన్నారు.